సాక్షి ప్రకాశం

ఆదివారం । 26 । జనవరి । 2025

I



కూటమి సేవలో ఖాకీలు

గిద్దలూరు నియోజకవర్గంలో పోలీసులు కూటమి నాయకుల అడుగులకు మడుగు లొత్తుతున్నారు. అమాయకులపై ప్రతాపం చూపుతున్నారు. - IIలో..



బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక


ఉమ్మడి ప్రకాశం జిల్లా అండర్–23 బాల, బాలికల బాస్కెట్ బాల్ జట్ల ఎంపిక కందుకూరు టీఆర్ఆర్ కాలేజీలో నిర్వహించారు. - IIలో..

గరిష్టం/కనిష్టం 31/20

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పొగమంచు కురుస్తుంది. రాత్రి చలిగాలులు వీస్తాయి.





గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం జాతీయ జెండా ఆవిష్కరణ, పోలీస్‌పరేడ్, ఇతర కార్యక్రమాలు నిర్వహించేందుకు ఒంగోలు పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఏర్పాట్లు పూర్తి చేశారు. మార్కాపురం పట్టణంలోని శ్రీ అరవింద పాఠశాలలో 800 మంది విద్యార్థులు శనివారం అశోక చక్రం ఆకారంలో కూర్చున్నారు. ఈ నమూనా పలువురిని ఆకట్టుకుంది. - ఒంగోలు సిటీ/మార్కాపురం టౌన్

న్యూస్‌రీల్

వేణుగోపాల్‌కు ఇండియన్ పోలీస్ మెడల్

- అభినందనలు తెలిపిన కబడ్డీ క్రీడా సంఘ ప్రతినిధులు



అన్ను వేణుగోపాల్‌ను అభినందిస్తున్న తెలంగాణ డీజీపీ డాక్టర్ జితేందర్

ఒంగోలు: అంతర్జాతీయ కబడ్డీ క్రీడాకారుడు, పేర్నమిట్ట వాసి అయిన అన్ను వేణుగోపాల్‌కు 75వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఇండియన్ పోలీస్ మెడల్ ఫర్ మెటీరియల్ సర్వీస్ కోసం ప్రకటించింది. వేణుగోపాల్ 1996లో ఆర్ఎస్సైగా హైదరాబాద్ సిటీ పోలీసు విభాగంలో ఎంపికయ్యారు. ప్రస్తుతం ఆయన డీఎస్పీగా తెలంగాణ రాష్ట్ర డీజీపీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయనకు తెలంగాణ డీజీపీ డాక్టర్ జితేందర్, ఇతర ఉన్నతాధికారులతోపాటు ప్రకాశం జిల్లా కబడ్డీ సంఘ సభ్యులు అభినందనలు తెలిపారు.

ఢిల్లీలో గణతంత్ర వేడుకల పరేడ్‌కు కంభం విద్యార్థి



చాట్ల రుత్విక్ బాబు

కంభం: ఢిల్లీలో ఆదివారం జరిగే 76వ గణతంత్ర దిన వేడుకల్లో కంభం పట్టణానికి చెందిన చాట్ల రుత్విక్ బాబు పాల్గొనేందుకు అవకాశం దక్కింది. గుంటూరు హిందూ కళాశాలలో డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్న రుత్విక్ బాబు ఎన్ఎస్ఎస్ ఆంధ్రప్రదేశ్ తరఫున ఎంపికై ఢిల్లీకి వెళ్లాడు. దేశ ప్రధాని పాల్గొనే పరేడ్ లో పాల్గొననుండటం సంతోషంగా ఉందని విద్యార్థి తెలిపాడు.

27లోపు పరీక్ష ఫీజు చెల్లించాలి

ఒంగోలు సిటీ: డి.ఈఐ, ఈడీ మూడో సెమిస్టర్ 2023–2025 పరీక్షలకు సంబంధించి ఎటువంటి అపరాధ రుసుం లేకుండా ఈ నెల 27వ తేదీలోపు చెల్లించవచ్చని డీఈఓ అత్తోట కిరణ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా డీఈఓ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ రూ.50 అపరాధ రుసుంతో ఈనెల 31 వరకు సంబంధిత కళాశాల ప్రిన్సిపాళ్లకు పరీక్ష రుసుం చెల్లించాలన్నారు. రెగ్యులర్ విద్యార్థులు రూ.250, నాలుగు నుంచి ఆరు సబ్జెక్టులకు రూ.250, మూడు సబ్జెక్టులకు రూ.175, రెండు సబ్జెక్టులకు రూ.150, ఒక్క సబ్జెక్టుకు రూ.125 లు చొప్పున పరీక్ష రుసుం చెల్లించాలని తెలిపారు.

వచ్చేనెల 8న నవోదయ ప్రవేశ పరీక్ష

ఒంగోలు సిటీ: ఒంగోలు జవహర్ నవోదయ విద్యాలయంలో 2025–26వ విద్యా సంవత్సరానికి 9, 11 తరగతిలో ప్రవేశించేందుకు ఫిబ్రవరి 8వ తేదీ ఉదయం 11 గంటలకు ప్రవేశపరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ వీకే.గీతాలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒంగోలు జవహర్ నవోదయ విద్యాలయంలో ప్రిన్సిపాల్ కార్యాలయంలో దరఖాస్తు చేసిన వారు ప్రిన్సిపాల్ కార్యాలయంలోనే హాల్ టికెట్లు పొందవచ్చన్నారు. విద్యార్థులు తమ హాల్ టికెట్లను ఈ నెల 27 నుంచి ఫిబ్రవరి 5వ తేదీ వరకు పనిదినాల్లో మాత్రమే ఉదయం 10 నుంచి పొందవచ్చన్నారు. కామన్‌సర్వీస్ సెంటర్ల ద్వారా (ఆన్‌లైన్) దరఖాస్తు చేసిన అభ్యర్థులు ఈ సెంటర్ల ద్వారానే హాల్ టికెట్లు పొందాలన్నారు. వివరాలకు 99510 91988, 93468 24862 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఓటు వజ్రాయుధం

జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా కొండపిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో విద్యార్థినులు ఎన్‌వీడీ (నేషనల్ ఓటర్స్ డే) 2025 అనే ఆకారంలో ప్రదర్శన నిర్వహించారు.

- కొండపి



సర్దుబాటలో కూలబడి..!

ఇంటి దగ్గర్లో ఉండే బడికి ఆడుతూ పాడుతూ వెళ్లొచ్చే విద్యార్థులు.. ఇప్పుడు కిలోమీటర్ల దూరంలో ఉన్న బడికి వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. ఫలితంగా వారు ప్రైవేటు బాట పట్టే అవకాశాలు ఉన్నాయి. దీంతో సర్కార్ పాఠశాలల భవిష్యత్ ప్రశ్నార్థకరంగా మారనుంది. విద్యా సంస్కరణల పేరుతో సర్కార్ విద్యను నిర్వీర్యం చేసే కుట్రలకు తెరతీసిందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పాఠశాలల సంఖ్య తగ్గితే ఆమేరకు మిగులు ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాల్సి ఉంటుంది. ఇక టీచర్ పోస్టుల భర్తీ ఉండదన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



టంగుటూరు మండలం వెలగపూడి ప్రాథమికోన్నత పాఠశాల

- కొత్త సంస్కరణల పేరుతో ప్రభుత్వ విద్యకు మంగళం
- మూసివేత దిశగా యూపీ స్కూల్స్, ఉన్నత పాఠశాలలు
- 135 యూపీ స్కూల్స్‌కు గ్రహణం
- 7 హైస్కూళ్లలో హెచ్ఎం, పీఈటీ పోస్టుల రద్దు
- 259 మంది ఉపాధ్యాయులకు సర్దుబాటు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు, విద్యావేత్తలు

ఒంగోలు సిటీ:

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మాజీ సీఎం జగన్ మోహన్‌రెడ్డి సర్కార్ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా నిలిపారు. కూటమి ప్రభుత్వం అందుకు భిన్నంగా వ్యవహరిస్తోంది. సంస్కరణల పేరుతో పంచాయతీకి ఒక పాఠశాల ఉండేట్టుగా, ఒక ఫౌండేషన్ స్కూల్, మోడల్ ప్రైమరీ స్కూల్ అని కొత్తగా ప్రవేశపెట్టడానికి సిద్ధం చేసింది. అయితే ఇందులో ఎన్ని లోటుపాట్లు ఉంటాయో తెలుసుకోకుండా అధ్యయనం చేయకుండా వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలు చేసేందుకు రంగం సిద్ధం చేస్తోంది. ఫలితంగా పలు ప్రభుత్వ పాఠశాలలు మూతపడనున్నాయి. దీంతో పేద, మధ్య తరగతి కుటుంబాల పిల్లలు ప్రభుత్వ పాఠశాలలకు పంపేందుకు అవస్థలు పడాల్సిన పరిస్థితులు నెలకొననున్నాయి. దీనిపై అటు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ఇటు ఉపాధ్యాయ వర్గాల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఒకటి, రెండు తరగతులను ప్రాథమిక పాఠశాలలో ఉంచి మూడు, నాలుగు తరగతులను ఉన్నత పాఠశాలలో కలపాలని ఆలోచిస్తున్నారు. దీంతో ఆరు, ఏడు తరగతులు నడుపుతున్న అప్పర్ ప్రైమరీ పాఠశాలల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. దీనికి తోడు ప్రతి పంచాయతీలో ఒకటే స్కూలు ఉండాలని ప్రభుత్వం భావిస్తోంది. మిగిలిన పాఠశాలల్లో ఉన్న విద్యార్థులను ఒకే స్కూల్లో మెర్జ్ చేసే అంశంపై సర్వత్రా వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

259 ఉపాధ్యాయ పోస్టులు మిగులు

జిల్లా వ్యాప్తంగా యూపీ స్కూల్స్ 181 ఉన్నాయి. ఇందులో 30 కంటే తక్కువ మంది విద్యార్థులు ఉన్న యూపీ స్కూల్స్ 62, 30 నుంచి 60 లోపు విద్యార్థులు ఉన్న యూపీ స్కూల్స్ 73, 60 కంటే ఎక్కువగా విద్యార్థులు ఉన్న యూపీ స్కూల్స్ 46 ఉన్నాయి. ఇందులో యూపీ స్కూల్స్ మూతపడి, వీటిస్థానంలో 135 ప్రైమరీ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నారు. యూపీ స్కూల్స్ మూతపడటంతో ఇందులో పనిచేసే ఉపాధ్యాయులు స్కూల్ అసిస్టెంట్ తెలుగులో 52, హిందీలో 40, ఇంగ్లిష్‌లో 43, మ్యాథమెటిక్స్‌లో 41, ఫిజికల్ సైన్స్‌లో 12, బయోలాజికల్ సైన్స్‌లో 30, సోషల్‌స్టడీస్‌లో 41 మంది చొప్పున 259 మంది స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు మిగులుతున్నారు.

ఆందోళనలో ఉపాధ్యాయులు

జీవో 117 ను కూటమి ప్రభుత్వం ఇప్పటికే రద్దు చేసింది. 3, 4, 5 తరగతులను వెనక్కి తీసుకొని వాటిని ఉన్నత పాఠశాలలో కలిపేందుకు సిద్ధం చేసింది. అప్పుడు ఈ తరగతుల్లో బోధిస్తున్న ఉపాధ్యాయులను పక్క స్కూళ్లలో ఉన్న ఉన్నత పాఠశాలలో సర్దుబాటు చేయాలి. ఇలా జిల్లాలో 259 మంది ఉపాధ్యాయులు మిగులుతారు. వీరిని సీనియారిటీ ప్రకారం ఎక్కడెక్కడ సర్దుబాటు చేస్తారోనని ఉపాధ్యాయులు మల్లగుల్లాలు పడుతున్నారు.

7 హైస్కూళ్లు విలీనం..

జిల్లా వ్యాప్తంగా మొత్తం 266 హైస్కూల్స్ ఉన్నాయి. అందులో 100 లోపు విద్యార్థులు ఉన్న స్కూల్స్ 29, 100 నుంచి 200 లోపు స్కూల్స్ 110 ఉన్నాయి. 200–300 లోపు స్కూల్స్ 59, 300 నుంచి 400 లోపు స్కూల్స్ 35, 400 నుంచి 800 లోపు స్కూల్స్ 25, 800 నుంచి 1000 లోపు స్కూల్స్ 5, 1000 కంటే ఎక్కువ ఉన్న స్కూల్స్ 3 ఉన్నాయి. ఇందులో 200 మంది విద్యార్థుల కంటే తక్కువగా ఉన్న హైస్కూల్స్ 129 ఉన్నాయి. 75 మంది విద్యార్థులు కంటే తక్కువగా ఉన్న హైస్కూల్స్ 7 ఉన్నాయి. నిబంధనల ప్రకారం 75 కంటే తక్కువ ఉన్న హైస్కూళ్లలో హెచ్ఎం, పీఈటీ పోస్టులను రద్దు చేస్తారు.

సబ్జెక్టులు	మంజూరైన పోస్టులు	117 రద్దుతో ఎలిజిబుల్ పోస్టులు	మిగులు పోస్టులు
లెక్కలు	584	445	139
ఇంగ్లిష్	551	405	146
తెలుగు	473	405	68
హిందీ	334	356	22
ఫిజికల్ సైన్స్	401	363	38
బయోలాజికల్ సైన్స్	414	375	39
సోషల్‌స్టడీస్	436	385	51



సింగరాయకొండ మండలం కలికవాయి ప్రాథమికోన్నత పాఠశాల

76వ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు

ఒంగోలు సిటీ: జిల్లాలోని ప్రజలందరికీ 76 వ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలను వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు చెవిరెడ్డి భాస్కరరెడ్డి, రాజ్యసభ సభ్యుడు వై.వి.సుబ్బారెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యుడు, కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదిమూలపు సురేష్, మాజీ మంత్రి, సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జ్ మేరుగు నాగార్జున, మాజీ ఎమ్మెల్యేలు గిద్దలూరు, మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు కేపీ నాగార్జునరెడ్డి, అన్నా రాంబాబు, ఒంగోలు, కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు చుండూరు రవిబాబు, దద్దాల నారాయణ యాదవ్ ఉన్నారు.

నేడు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గణతంత్ర వేడుకలు

ఒంగోలు సిటీ: స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం 76 వ గణతంత్ర దినోత్సవాన్ని పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ ఒంగోలు నగర కన్వీనర్ కటారి శంకరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 9 గంటలకు జాతీయ జెండా ఆవిష్కరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబు పాల్గొంటున్నట్లు తెలిపారు.

కలెక్టర్‌కు బెస్ట్ ఎలక్టోరల్ ప్రాక్టీసెస్ అవార్డు



అవార్డు అందుకుంటున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఆర్డీఓ లక్ష్మీప్రసన్న, తహశీల్దార్ శ్రావణ్‌కుమార్, ఐటీ కోర్ సీఐ సూర్యనారాయణ

ఒంగోలు అర్బన్/ఒంగోలు సిటీ: జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా శనివారం విజయవాడలో తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన కార్యక్రమంలో బెస్ట్ ఎలక్టోరల్ ప్రాక్టీసెస్ అవార్డు–2024ను కలెక్టర్ తమీమ్ అన్సారియా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే విజయానంద్ చేతులమీదుగా అందుకున్నారు. అత్యంత పారదర్శకంగా ఓటర్ల జాబితా రూపకల్పన, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేందుకు నిర్వహించే వినూత్న కార్యక్రమాలు, ఓటర్లను జాగృతం చేయడం తదితర అంశాల్లో అత్యుత్తమ పనితీరు కనపరిచినందుకు కలెక్టర్ అవార్డు అందుకున్నారు. అదేవిధంగా ఉత్తమ పనితీరు కనపరిచిన ఒంగోలు ఆర్డీవో కే లక్ష్మీ ప్రసన్న, దర్శి తహశీల్దార్ శ్రావణ్‌కుమార్‌లు కూడా అవార్డులు అందుకున్నారు. అవార్డు గ్రహీతలను సీఎస్‌తో పాటు మాజీ రాష్ట్ర ఎన్నికల కమిషన్ రమేష్‌కుమార్ ఇతర ఉన్నతాధికారులు అభినందించారు.

గతత సార్వత్రిక ఎన్నికలు సమర్థవంతంగా జరిగేందుకు ఎలక్షన్ సెల్ లో విధులు నిర్వహిస్తూ ఎన్నికలకు సంబంధించిన బందోబస్తు స్కీమ్ ను ఏర్పాటు చేయటంలో ప్రకాశం జిల్లా ఐటీకోర్ ఇన్‌స్పెక్టర్ సూర్యనారాయణ ఎక్సలెన్స్ ఇన్ కండక్టింగ్ ఎలక్షన్స్ అండ్ సెక్యూరిటీ మేనేజ్మెంట్ అవార్డు అందుకున్నారు. సూర్యనారాయణను ఎస్పీ దామోదర్ ప్రత్యేకంగా అభినందించారు.

ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు కీలకం

- ఎస్పీ ఏ.ఆర్.దామోదర్



జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ చేస్తున్న ఎస్పీ దామోదర్

ఒంగోలు సిటీ: ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు ఎంతో కీలకమని ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తెరగాలని ఎస్పీ ఏ.ఆర్.దామోదర్ సూచించారు. శనివారం 15 వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా జిల్లా పోలీసు గ్రౌండ్‌లో ఎస్పీ దామోదర్ పోలీసు అధికారులు, సిబ్బంది చేత 'ఓటర్స్ డే' ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జనవరి 25 వ తేదీన దేశవ్యాప్తంగా జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని జరుపుకుంటామన్నారు. దేశంలో 1950 జనవరి 25న ఎన్నికల కమిషన్ ను ఏర్పాటు చేసిన సందర్భంగా నేషనల్ ఓటర్స్ డే నిర్వహిస్తున్నామన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్క ఓటరు బాధ్యతగా ఓటు హక్కు వినియోగించుకోవడం జాతీయ ఓటర్ల దినోత్సవం ప్రధాన ఉద్దేశమని చెప్పారు. ఓటుహక్కు ప్రాముఖ్యత పై అవగాహన కల్పించాలన్నారు. 18 ఏళ్ల నిండిన యువతీ, యువకులను నూతన ఓటర్లుగా నమోదు చేయడం ద్వారా వారిని ప్రజాస్వామ్యంలో భాగస్వాములను చేయాలన్నారు. సిబ్బంది చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ అశోక్‌బాబు, ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రాఘువేంద్ర, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ దేవప్రభాకర్, ఒంగోలు టౌన్ సీఐలు నాగరాజులు, శ్రీనివాసరావు, అజెయ్‌కుమార్, పాండురంగారావు, ఆర్ఐలు రమణారెడ్డి, సీతారామిరెడ్డి, ఎస్సైలు పాల్గొన్నారు.

మెరిసిన స్మార్ట్‌పోల్..జాబిల్లి జిలుగులు

- దక్షిణ భారత జాతీయ స్థాయి సైన్స్ ఫెయిర్‌లో 'స్మార్ట్‌పోల్' ప్రాజెక్టుకు ద్వితీయ బహుమతి
- టీచర్ కేటగిరీలో 'జాబిల్లి జిలుగులు'కు స్పెషల్ ప్రైజ్

ఒంగోలు సిటీ:

దక్షిణ భారత జాతీయ స్థాయి సైన్స్ ఫెయిర్ 2025 లో జిల్లా నుంచి పాల్గొన్న వ్యక్తిగత ఎగ్జిబిట్ కింద 'స్మార్ట్ పోల్' ప్రాజెక్టు ద్వితీయ బహుమతి గెలుపొందింది. అలాగే టీచర్ ప్రాజెక్టు కింద పాల్గొన్న 'జాబిల్లి జిలుగులు' ప్రత్యేక బహుమతిని గెలుచుకుంది. దక్షిణ భారత జాతీయ స్థాయి సైన్స్ ఫెయిర్ 2025 ఈనెల 20 నుంచి 25వ తేదీ వరకు పుదుచ్చేరిలో నిర్వహించారు. ఈ సైన్స్ ఫెయిర్ లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ, కర్ణాటక, తమిళనాడు, పుదుచ్చేరి వంటి 6 రాష్ట్రాలు పాల్గొన్నాయి. ఈ రాష్ట్రాల నుంచి 210 ప్రాజెక్టులు వచ్చాయి. ఈ సైన్స్ ఫెయిర్‌లో ప్రకాశం జిల్లా నుంచి రెండు ఎగ్జిబిట్స్ పాల్గొన్నాయి. విజేతలను డీఈఓ అత్తోట కిరణ్‌కుమార్, ఒంగోలు డిప్యూటీ డీఈఓ చంద్రమౌళీశ్వరరావు, మార్కాపురం ఉప విద్యాశాఖాధికారి శామ్యూల్, జిల్లా సైన్స్ అధికారి టి.రమేష్ ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

వ్యక్తిగత ఎగ్జిబిట్:

ప్రాజెక్టు పేరు : 'స్మార్ట్‌పోల్'
గైడ్ టీచర్ : పి.శ్రీలక్ష్మీ కామేశ్వరి
విద్యార్థిని పేరు : డి.కీర్తన
పాఠశాల పేరు : జెడ్పీ బాలికోన్నత పాఠశాల, మార్కాపురం

స్మార్ట్‌పోల్ సారాంశం: స్మార్ట్‌పోల్ అంటే సాధారణంగా ఉపయోగించే వీధిదీపాల స్తంభాల స్థానంలో సౌరశక్తిని ఉపయోగించి పనిచేసే ఎల్ఈడీలు, వైఫై రూటర్, సర్వైలెన్స్ కెమెరాలు, డిజిటల్ సైన్‌బోర్డులు, వాతావరణ సెన్సార్లు, ప్రజలను అప్రమత్తం చేసే స్పీకర్లు, విద్యుత్ తో నడిచే వాహనాలకు ఛార్జర్లు కలిగి ఉన్న స్తంభాలను ఏర్పాటు చేయాలి.

ఉపయోగాలు: పట్టణాల్లో అన్ని రకాల పరికరాలను ఒకే కేంద్రీకృత వ్యవస్థతో అనుసంధానం చేయడం వల్ల పౌర సేవలను వేగవంతం చేయవచ్చు. రవాణా వ్యవస్థను సమర్థవంతంగా చేయవచ్చు. కార్బన్ డై ఆక్సైడ్ ఉద్గారాలను తగ్గించవచ్చు. పల్లెల్లో కూడా వాతావరణ సెన్సార్లను వ్యవసాయ రంగంలో ఉపయోగించవచ్చు. ఎలక్ట్రిక్ కార్లు, బైకులను రోడ్డుపైనే చార్జింగ్ చేయవచ్చు.



బహుమతి అందుకుంటున్న విద్యార్థిని కీర్తన, గైడ్ టీచరు శ్రీలక్ష్మీ కామేశ్వరి

టీచర్ ప్రాజెక్టు:

ప్రాజెక్టు పేరు: 'జాబిల్లి జిలుగులు' (చంద్రయాన్–3)
స్కూల్‌పేరు : ఈదుమూడి జెడ్పీ హైస్కూల్, నాగులుప్పలపాడు మండలం

ప్రాజెక్టు సారాంశం: ఇస్రో వెల్లడించిన వివరాల ప్రకారం చంద్రయాన్–3 ప్రయోగంలో ఏమి కనుగొన్నారు, వాటి ప్రయోజనం వాటి వివరణల గురించి తెలుసుకోవడం.

- ✔ చంద్రుని దక్షిణ ధృవంపై ల్యాండర్ సాఫ్ట్ ల్యాండ్ అవడం
- ✔ ల్యాండర్ రోవర్‌లు చంద్రుడి ఉపరితలంపై పరిశోధనలు చేసి పేలోడ్ల ద్వారా ప్లాస్మా కొలత, సాంద్రతల గురించి తెలుసుకున్నారు.
- ✔ భూకంప కొలతలు గురించి, ఉష్ణోగ్రతలో మార్పులు, సల్ఫర్, మిగిలిన మూలకాలు ఉన్నట్లు గుర్తించారు.
- ✔ చంద్రుని పై జరిగిన మార్పులకు ఇస్రో వాళ్లకు నివేదిక సమర్పించారు.



స్పెషల్ ప్రైజ్ అందుకుంటున్న టీచరు కాకి స్వర్ణలత

ఓటు హక్కుతోనే సుపరిపాలన సాధ్యం



ఓటర్ల చేత ప్రతిజ్ఞ చేయిస్తున్న జేసీ గోపాలకృష్ణ, జిల్లా అధికారులు

- జాతీయ ఓటర్ల దినోత్సవంలో జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ

ఒంగోలు అర్బన్: ఓటు హక్కును ఆలోచనతో సద్వినియోగం చేసుకుంటే సుపరిపాలన సాధ్యమవుతుందని జాయింట్ కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ప్రకాశం భవనంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని, ఓటర్లంతా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. గత ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నిల్లో రాష్ట్రంలో పోలింగ్ శాతం పరంగా మన జిల్లా ప్రథమ స్థానంలో నిలవడం గర్వించదగిన విషయం అన్నారు. పట్టణ ప్రాంత ఓటర్లు కూడా మరింత చురుగ్గా ఓటింగ్‌లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భాగంగా సీనియర్ ఓటర్లను జాయింట్ కలెక్టర్ సత్కరించారు. తొలిసారి ఓటర్లుగా నమోదైన వారికి గుర్తింపు కార్డులు అందజేశారు. ఓటర్ల దినోత్సవంపై నిర్వహించిన పలు పోటీల్లో గెలుపొందిన విజేతలకు ప్రశంస పత్రాలు అందించారు. ప్రజాస్వామ్య వ్యవస్థ మరింత బలోపేతం అయ్యేలా ఓటు హక్కును వినియోగించుకుంటామని ప్రతిజ్ఞ చేయించారు. తొలుత ఢిల్లీ నుంచి చీఫ్ ఎలక్షన్ కమిషన్ రాజీవ్ కుమార్ ఇచ్చిన సందేశాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. అనంతరం ఓటర్లలో అవగాహన కల్పించేలా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీపై జాయింట్ కలెక్టర్ ఇతర అధికారులు సంతకాలు చేశారు. నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. దీనిలో డీఆర్ఓ చిన ఓబులేసు, డీపీవో వెంకటనాయుడు, మైనార్టీ సంక్షేమ అధికారి పార్థసారథి, డీడీఏ పీడీ రవికుమార్, ఆర్ఐఓ సైమన్ విక్టర్, డీఈఓ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం

● రూ.80 వేల ఆస్తి నష్టం



కాలిపోయిన సామగ్రి

మార్కాపురం: మండలంలోని గోగులదిన్నెలో శనివారం ఓ ఇంట్లో విద్యుత్ షార్టు సర్క్యూట్ జరిగి అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. సుమారు రూ.80 వేల ఆస్తి నష్టం జరిగినట్లు బాధితురాలు కొండమ్మ తెలిపింది. గ్రామానికి చెందిన కూకట్లపల్లి కొండమ్మ స్థానిక ఎస్టేట్‌లో పలకల కార్మికురాలిగా పనిచేస్తోంది. శనివారం యథావిధిగా ఇంటికి తాళం వేసుకుని కుమార్తెను స్కూల్‌కు పంపి తానూ పనికి వెళ్లింది. మధ్యాహ్న సమయంలో ఇంట్లో నుంచి పొగలు, మంటలు వస్తున్నాయనే సమాచారం రావడంతో హుటాహుటిన ఇంటికి వెళ్లింది. కరెంట్ మీటర్ నుంచి మంటలు వచ్చినట్లు గుర్తించింది. ఇంట్లో ఉన్న నిత్యావసరాలు, చీరలు, దుస్తులు, డబ్బులు, కాలిపోయినట్లు ఆవేదన వ్యక్తం చేసింది. ప్రభుత్వం తనను ఆదుకోవాలని ఆమె కోరుతోంది.

జాబ్ పీకేయిస్తా..!

● సర్వేయర్‌పై కన్నెర్రజేసిన టీడీపీ కార్యకర్త

● కన్నీరు పెట్టిన సచివాలయ ఉద్యోగి

యర్రగొండపాలెం: నాయకుల బాటలో కార్యకర్తలు అన్నట్లు కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత టీడీపీలో ఉన్న ప్రతి ఒక్కరికీ కొమ్ములు మొలిచినట్లుంది. వారికి అధికారులంటే తమ ఇంట్లో పాలేర్లుగా పని చేస్తున్నట్లు కనిపిస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే ఓ నాయకుడు నిన్ను జాబ్‌లో నుంచి పీకేయిస్తానని గంగపాలెం సచివాలయంలో సర్వేయర్‌గా పనిచేస్తున్న లక్ష్మీనారాయణరాజుపై చిందులు తొక్కాడు. అక్కడ ఉన్న రైతుల వద్ద తీవ్ర అవమానంగా మాట్లాడటంతో చిన్నబుచ్చుకున్న ఆయన కన్నీటి పర్యంతమయ్యాడు. శనివారం మండలంలోని రామచంద్రాపురం ఇలాకాలో రీ సర్వే చేసేందుకు వెళ్లిన సర్వేయర్ హద్దుల గురించి విచారిస్తున్నాడు. కొత్త భాస్కర్‌కు చెందిన భూమి (ఆన్‌లైన్‌లో లేదు) హద్దుల గురించి అడిగాడు. దీంతో ఆయన తనకు నోటికొచ్చినట్లు మాట్లాడటంతో చేసేదిలేక ఆ ఉద్యోగి తన ఉన్నతాధికారికి ఫిర్యాదు చేశాడు. పోలీస్ కేసు పెట్టించేందుకు ఆ అధికారి ప్రయత్నించినప్పటికీ కూటమి నాయకుల చలువ ఆ కార్యకర్తపైనే ఉంటుందన్న ఉద్దేశంతో అతనిపై కేసు పెట్టేందుకు నిరాకరించినట్లు తెలిసింది. ఈ విధంగా ప్రభుత్వ ఉద్యోగులపై పెత్తనం చెలాయించడంతో పాటు నోటికి వచ్చినట్లు మాట్లాడటం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నిస్తున్నారు.

కూటమి సేవలో ఖాకీలు

● పాలకుల అక్రమాలకు అడుగడుగునా పోలీసుల సహకారం ● నెలవారీ మామూళ్లు పుచ్చుకుంటూ గాలికొదిలేసిన విధులు ● కంభంలో వరుస దొంగతనాలతో ప్రజల బెంబేలు ● రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు శూన్యం ● ఎనిమిది నెలల్లో సుమారు 40 మంది మృతి ● అమాయకులపై అక్రమ కేసులు

గిద్దలూరు నియోజకవర్గంలో పోలీసులు కూటమి నాయకుల అడుగులకు మడుగులొత్తుతున్నారు. అమాయకులపై ప్రతాపం చూపుతూ అక్రమార్కులకు అండగా ఉంటున్నారు. బాధితుల పక్షాన నిలిచి ధైర్యం చెప్పకుండా తిరిగి వారిపైనే దౌర్జన్యం చేస్తున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పోలీసులు రాజకీయాలకు అతీతంగా పనిచేశారు. న్యాయం పక్షాన నిలిచి బాధితులకు అండగా ఉన్నారు. నేడు పరిస్థితి ఆ విధంగా లేదు. బాధితులపైనే అన్యాయంగా కేసులు బనాయిస్తూ అధికార పార్టీకి దాసోహం అయ్యారనే అప్రతిష్ట పోలీసులు మూటగట్టుకుంటున్నారు.



మృతుడు గడ్డం ఆనంద్ (ఫైల్)

బేస్తవారిపేట: శాంతి భద్రతల పరిరక్షణ, దొంగతనాలను నివారించడం, రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాల్సిన పోలీసులు వాటిపై దృష్టి పెట్టడం లేదు. కంభం మండలంలో గతంలో ఎన్నడూ లేనంతగా దొంగతనాలు హెచ్చుమీరాయి. కుటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ ఆరు నెలల వ్యవధిలో 20 దొంగతనాలు జరిగాయి. వరుస దొంగతనాలతో కంభం పట్టణ ప్రజలు బెంబేలెత్తుతున్నారు. పలు దొంగతనాల్లో సీసీ కెమెరాల్లో దొంగల ఫొటోలు నమోదవుతున్నా వారిని గుర్తించలేకపోతున్నారు. బ్యాంకుల వద్దే నగదు అపహరణ, ద్విచక్ర వాహనాల దొంగతనాల ఘటనలు నాలుగైదు ఉన్నాయి. వెలుగులోకి రానివి మరెన్నో. దొంగతనాలు అరికట్టేందుకు పోలీసులు తగిన చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నైట్ పెట్రోలింగ్ బలోపేతం చేయడం, అవసరమైన చోట సీసీ కెమెరాల ఏర్పాటు చేయాల్సి ఉంది. గతంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పనిచేయకున్నా పోలీసులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినబడుతున్నాయి. జగ్గంగుంట్ల నుంచి కంభం మీదుగా బేస్తవారిపేట వరకు హైవేపై రోడ్డు ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి. ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి పోలీసులు తగు జాగ్రత్తలు తీసుకున్న దాఖలాలు ఏమాత్రం లేవు. గతంలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి కొంతమేర నివారణ చర్యలు తీసుకున్నారు. ఇప్పుడు ఆ దిశగా ఎటువంటి చర్యలు చేపట్టడం లేదన్న ఆరోపణలు పోలీసులపై బలంగా వినిపిస్తున్నాయి.

పోలీసుల తప్పటడుగుల్లో మచ్చుకు కొన్ని..

■ గిద్దలూరు మండలం కేఎస్‌పల్లె ఎస్సీ కాలనీకి చెందిన దళిత యువకుడు గడ్డం ఆనంద్ అక్టోబర్ 28వ తేదీన సగిలేరులో అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. అయితే స్నేహితులు చంపారని మృతుడి కుటుంబం తీవ్రస్థాయిలో ఆరోపణలు గుప్పించింది. ఆ దిశగా పోలీసులు దర్యాప్తు చేయకపోవడంతో బాధితులు ఈ నెల 20వ తేదీ రాత్రి స్టేషన్ ఎదుట బైఠాయించి ఆందోళనకు దిగారు. పోస్టుమార్టం నివేదికను పోలీసులు తారుమారు చేశారంటూ ఈ నెల 22న కేఎస్ పల్లెలో నంద్యాల హైవేను ముట్టడించి పోలీసుల తీరుపై దుమ్మెత్తిపోశారు. ఆనంద్‌కు ఈతలో నైపుణ్యం ఉన్నా నీట మునిగి మృతి చెందాడని చెప్పడం, మృతదేహంపై గాయాలు ఉండటం, రక్తంతో తడిసిన దుస్తులు చూపకపోవడం, సంఘటన స్థలంలో మనిషి మునిగిపోయే లోతు కూడా లేకపోవడంతో ఆనంద్‌ది హత్యేనంటూ మృతుడి కుటుంబం ఆరోపిస్తుంది. పోలీసులు ఆ దిశగా దర్యాప్తు చేపట్టకపోగా పోస్టుమార్టం నివేదిక ఆధారంగానే చర్యలు ఉంటాయని చెప్పడం బాధితుల ఆరోపణలకు బలం చేకూరుతోంది.



ఈ నెల 22వ తేదీన కేఎస్ పల్లె వద్ద నంద్యాల హైవేపై బాధితుల ధర్నా

■ కంభానికి చెందిన మెట్టు శివరామిరెడ్డి అనే వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా యాక్టివిస్టును స్టేషన్‌కు పిలిపించి ఎస్సై కొట్టారు. ఈ విషయంపై వైఎస్సార్ సీపీ నాయకులు స్టేషన్‌కు చేరుకుని ఎస్సైను ప్రశ్నించడంతో టీడీపీ నాయకులతో ఫిర్యాదు చేయించి అక్రమ కేసులు బనాయించడం పోలీసులు తీరును తేటతెల్లం చేసింది.మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలు ఘనంగా చేశారని అర్ధవీడు మండలం యాచవరానికి చెందిన రామకృష్ణపై సైతం పోలీసులు దాడి చేశారు. అర్ధవీడు మండలం టీడీపీ నాయకుల ప్రోత్సాహంతోనే దాడికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి.

■ కొమరోలు మండలం తాటిచర్ల సాగు నీటి సంఘం ఎన్నికల్లో పోటీ చేసే వైఎస్సార్ సీపీ అభ్యర్థులను పోలీసులు అర్ధరాత్రి వేళ అదుపులోకి తీసుకున్నారు. ముత్తరాసుపల్లెలో టీడీపీ నాయకులు వైఎస్సార్ సీపీ శ్రేణులను కవ్వించడంతో ఘర్షణ జరిగింది. ఈ ఘటనలపై అక్రమ కేసులు బనాయించాలని పోలీసులపై టీడీపీ ముఖ్య నేతలు తీవ్ర స్థాయిలో ఒత్తిడి చేయడాన్ని భరించలేక ఎస్సై నెలన్నర క్రితం సెలవుపై వెళ్లిపోయారు. ఇప్పటికీ ఇక్కడికి వచ్చేందుకు ఆయన విముఖత చూపుతున్నారనే గుసగుసలు వినబడుతున్నాయి.

■ అర్ధవీడు ఎస్సై మాగుటూరులో గణేష్ నిమజ్జనం సందర్భంగా టపాసుల నిప్పురవ్వలు గృహంలో పడ్డాయంటూ ఓ మహిళతో వైఎస్సార్ సీపీ నాయకులు, గ్రామ పెద్దలపై ఫిర్యాదు చేయించారు. వాస్తవానికి ఆ మహిళ కేసు నమోదు వద్దని వారిస్తున్నా ఎస్సై, టీడీపీ నేతలు అత్యుత్సాహం చూపారు.

■ ఇక నియోజకవర్గంలో పశువుల రవాణా, ఇసుక అమ్మకాలు, రేషన్ బియ్యం, రెస్టారెంట్ నిర్వాహకుల వద్ద నెల వారీ మామూళ్లు దండుకుంటున్నారని గిద్దలూరు నియోజకవర్గంలో తీవ్ర స్థాయిలో చర్చ నడుస్తోంది.

బీజేపీలో చేరడంతో నేతలపై దాడి

గిద్దలూరు కో ఆప్షన్ సభ్యుడు మస్తాన్‌వలి, కంచుపల్లె డీలర్ పీరయ్య, హీరో షోరూం రాజశేఖర్ యాదవ్‌లు బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందరేశ్వరి వద్ద ఆ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేరి రైల్వేస్టేషన్‌లో రైలు దిగిన వెంటనే పీరయ్య, మస్తాన్‌వలిపై టీడీపీ నాయకులు, కార్యకర్తలు దాడికి పాల్పడ్డారు. రాజశేఖర్ యాదవ్‌ను షోరూం వద్దే కొట్టారు. కూటమి ప్రభుత్వంలో బీజేపీలో చేరిన వారిపై దాడులు చేయడం విస్మయం వ్యక్తం అవుతోంది. దాడికి పాల్పడిన వారిపై పోలీస్ శాఖ ఎటువంటి చర్యలు తీసుకోలేదనే విమర్శలు వస్తున్నాయి.

గణతంత్ర దినోత్సవానికి ఏర్పాట్లు పూర్తి



పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ ఏఆర్ దామోదర్

● పోలీస్ పరేడ్‌లో రిహార్సల్స్‌ను పరిశీలించిన ఎస్పీ దామోదర్

ఒంగోలు సిటీ: గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఒంగోలు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు పరేడ్ కమాండర్‌గా నిర్వహించిన కవాత్ రిహార్సల్స్‌ను ఎస్పీ ఏఆర్ దామోదర్ శనివారం పరిశీలించారు. రిహార్సల్స్‌లో భాగంగా తొలుత గౌరవ వందనం స్వీకరించి అనంతరం ఆయన జాతీయ పతాకం ఎగురవేశారు. పరేడ్ పరిశీలన వాహనంలో వెళ్లి పోలీసు బలగాల పరేడ్‌ను కూడా తిలకించారు. కవాత్ నిర్వహించడంలో కొన్ని మెళుకువలు సూచించారు. ప్రజాప్రతినిధులు, వీఐపీలను ఏదైనా ప్రాంతంలోని రూమ్‌లో తీవ్రవాదులు బంధించినప్పుడు పోలీస్ స్వాట్ కమాండోలు రంగంలోకి దిగి సురక్షితంగా ప్రముఖులను ఎలా కాపాడతారో డెమో ద్వారా ప్రదర్శించారు. తర్వాత ఎస్పీ దామోదర్ స్వాట్ టీమ్‌కు పలు సూచనలు తెలియజేసి ఆదివారం ఇంకా అద్భుతంగా ప్రదర్శించాలన్నారు. వేడుకలకు అతిథులు, ప్రముఖులు, విద్యార్థులు హాజరుకానున్నందున అన్ని రకాల భద్రత చర్యలు తీసుకోవాలని, ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, మంచినీటి సదుపాయం, వాహనాల పార్కింగ్ తదితర అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ దామోదర్ మాట్లాడుతూ ప్రకాశం పోలీస్ పరేడ్ ద్వారా జిల్లా ఖ్యాతిని చాటి చెప్పాలని కోరారు. పరేడ్‌లో మహిళా, హోమ్ గార్డ్, ఎన్‌సీసీ ప్లాటూన్‌లను ప్రత్యేకంగా ఏర్పాటు చేశామని తెలిపారు. ముఖ్య అతిథులు, ప్రజానీకానికి దేశ ఉన్నతిని చాటేలా పోలీస్ పరేడ్ సాగాలన్నారు. ఉత్సాహంగా కవాతు ప్రదర్శన చేయాలని సూచించారు. ఏఆర్ అడిషనల్ ఎస్పీ అశోక్‌బాబు, ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ దేవప్రభాకర్, ఒంగోలు టౌన్ సీఐలు నాగరాజు, శ్రీనివాసరావు, అజయ్‌కుమార్, పాండురంగారావు, ఆర్‌ఐలు రమణారెడ్డి, సీతారామిరెడ్డి, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న వైస్ ఛాన్సలర్ మూర్తి

● ఏకేయూ వీసీ ప్రొఫెసర్ డి.వి.ఆర్.మూర్తి

ఒంగోలు సిటీ: దేశంలో పుట్టిన ప్రతి ఒక్క పౌరుడు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ఆంధ్రకేసరి యూనివర్సిటీ వీసీ మూర్తి తెలిపారు. ఆంధ్ర కేసరి యూనివర్సిటీ సెమినార్ హాల్‌లో శనివారం ఎన్.ఎస్.ఎస్ ఆధ్వర్యంలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ప్రిన్సిపాల్ రాజమోహనరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వీసీ మూర్తి మాట్లాడుతూ మారిన కాలానికి అనుగుణంగా శాస్త్ర సాంకేతిక రంగాల్లో చోటు చేసుకున్న విప్లవాత్మకమైన మార్పుల కారణంగా భారత ఎన్నికల సంఘం ఓటు చేర్చుకునే దశ నుంచి ఓటు హక్కును వినియోగించుకునేంత వరకు అనేక చర్యలు తీసుకుందన్నారు. ఇందు కోసం ఓటర్ల అవగాహన సదస్సులు, ఓటర్ల చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల్లో ఓటు హక్కును వినియోగించుకోవడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. అనంతరం ఏకేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ హరిబాబు మాట్లాడుతూ ఓటు హక్కు ప్రాధాన్యత ను యువతీ యువకులకు వివరించారు. ప్రజాస్వామ్య బద్ధంగా పాలకులను ఎంపిక చేయడం కోసం మాత్రమే గ్రామ పంచాయతీ స్థాయి నుంచి పార్లమెంట్ స్థాయి వరకు ఎన్నికలు నిర్వహిస్తారన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాల్సిన ఆవశ్యకత ఉందని చెప్పారు. అనంతరం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ హరిబాబు బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎన్.నిర్మలామణి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టరు మండే హర్షప్రీతందేవ్ కుమార్, సోషల్ వర్క్ విభాగం హెడ్ డాక్టర్ పిల్లి వెంకటరావు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఉమ్మడి ప్రకాశం జిల్లా బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక



ఎంపికైన బాలుర జట్టు



బాలికల జట్టు

కందుకూరు రూరల్: ఉమ్మడి ప్రకాశం జిల్లా అండర్-23 బాల, బాలికల బాస్కెట్ బాల్ జట్ల ఎంపిక కందుకూరులోని టీఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో శనివారం నిర్వహించారు. జిల్లా నుంచి బాలుర 40 మంది, బాలికలు 20 మంది ఈ ఎంపికల్లో పాల్గొన్నారు. వీరిని ప్రతిభ ఆధారంగా ఎంపిక చేశారు. ఎంపికైన జట్లు విజయవాడ మేరీ స్టెల్లా కళాశాలలో ఈ నెల 28 నుంచి 31వ తేదీ వరకు జరిగే మొట్టమొదటి అండర్-23 రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాయని బాస్కెట్ బాల్ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ టి.సుబ్బారావు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఎస్కే నాగూర్‌వలి మాట్లాడుతూ క్రీడాకారులు మంచి ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీల్లో విజయం సాధించాలన్నారు. జిల్లాతో పాటు కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా ప్రెసిడెంట్ వలేటి రవీంద్ర, అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ సయ్యద్ జిలానీబాషా పాల్గొన్నారు.

జింకకు గాయం




గాయపడిన జింకకు చికిత్స చేస్తున్న పశువైద్యుడు

తాళ్లూరు: మండలంలోని రజానగరంలో ఓ జింక శనివారం కలకలం సృష్టించింది. పొలాల నుంచి తప్పించుకొని గ్రామంలోకి వచ్చింది. జింకను చూసిన కుక్కలు వెంబడించి దాడి చేసి గాయపరిచాయి. దాడిలో జింక వెనుక భాగం గాయమైంది. స్థానికులు వెంటనే జింకను తాళ్లూరులోని పశు వైద్యశాలకు తరలించారు. అక్కడి వైద్యులు చికిత్స అందించారు. అనంతరం ఫారెస్ట్ అధికారులకు జింకను అప్పగించినట్లు పశువైద్యుడు ప్రతాప్‌రెడ్డి తెలిపారు.

ఓటర్లుగా చేరి ఓటింగ్ శాతాన్ని పెంచాలి

● జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ రోణంకి



మాట్లాడుతున్న జేసీ గోపాలకృష్ణ రోణంకి

ఒంగోలు సిటీ: యువత తమ ఓటును రిజిస్ట్రేషన్ చేసుకొని ఓటింగ్ శాతాన్ని పెంచాలని జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ రోణంకి సూచించారు. 15వ నేషనల్ ఓటర్స్ డే సందర్భంగా బీ ది చేంజ్ ఫౌండేషన్, రైస్ కాలేజీ ఆధ్వర్యంలో శనివారం జరిగిన క్యాస్ట్ యువర్ వైట్ బట్ నాట్ క్యాష్ యువర్ ఓటు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జేసీ గోపాలకృష్ణ మాట్లాడుతూ ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా జాతి, కుల, మత వివక్ష లేకుండా ఓటు హక్కును వినియోగించుకున్నప్పుడే ప్రజాస్వామ్యాన్ని కాపాడగలమని చెప్పారు. అనంతరం ఆయన అందరితో ఓటర్ల ప్రతిజ్ఞ చేయించారు. టంగుటూరు తహసీల్దార్ వీరాంజనేయులు, రైస్ కాలేజీ డైరెక్టర్ ప్రభాకర్, ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం, బీ ది చేంజ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు వెంకటసాయి, విద్యార్థులు పాల్గొన్నారు.

కొండ తవ్వకాన్ని అడ్డుకున్న గ్రామస్తులు

తాళ్లూరు: మండలంలోని కొర్రపాటివారిపాలెంలో మట్టికొండను గ్రీన్‌లైన్ హైవే పనుల కోసం తవ్వి లారీల్లో తరలిస్తున్న మట్టిని స్థానికులు శనివారం అడ్డుకున్నారు. తమకు జీవనాధారమైన కొండను తవ్వి మట్టిని ఎలా పనులకు ఉపయోగిస్తారని ప్రశ్నించారు. కొండపై ఆధారపడి గొర్రెలు, గేదెలు మేపుకుంటున్నామని, వాటి పాలను అమ్ముకొని జీవనం కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. ఇలా కొండను తవ్వి ఎలా పొట్ట కొడతారని గ్రామస్తులు ప్రశ్నించారు. అధికారులు, రాజకీయ నాయకులు స్పందించి మట్టి తరలించకుండా స్థానికులు కోరారు. మట్టి తవ్వకాలను తాము అడ్డుకుంటే ఎస్సై వచ్చి ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని, అధికారుల అనుమతితోనే మట్టి తవ్వుతున్నారని హెచ్చరించడం ఎంతవరకు సమంజసమని గ్రామస్తులు విచారం వ్యక్తం చేశారు. గతంలో మట్టి తవ్వకాలను గ్రామస్తులు అడ్డుకోవడంతో పనులు నిలిచిపోయాయని, ఇప్పుడు గ్రీన్‌లైన్ హైవేకు సంబంధించిన అధికారులు ప్రభుత్వం నుంచి అనుమతి తెచ్చుకున్నారంటూ ఈ వ్యవహారంపై ఎస్సై మల్లికార్జున వివరణ ఇచ్చారు.



మట్టి తవ్వకాలను అడ్డుకుంటున్న గ్రామస్తులు

బోడే రామచంద్ర యాదవ్‌పై కేసు

పొదిలి రూరల్: రోడ్డుపై రాకపోకలకు అంతరాయం కల్పించి ప్రజలను భయభ్రాంతులకు గురి చేసిన భారతీయ చైతన్య యువజన పార్టీ అధ్యక్షుడు బోడే రామచంద్ర యాదవ్‌తో పాటు మరి కొందరిపై కేసు నమోదు చేసినట్లు పొదిలి ఎస్ఐ వి.వేమన తెలిపారు. మండలంలోని ఏలూరు పంచాయతీ టి.సల్లూరులో ఎలగల వెంకటేశ్వర్లు మృతదేహానికి హిందూ శ్మశానంలో అంత్యక్రియలు చేసే ప్రయత్నంలో రెండు కులాల మధ్య వివాదం చోటుచేసుకున్న విషయం తెలిసిందే. దీనిపై శుక్రవారం ఒంగోలు-కర్నూలు రహదారిపై పోలీసుస్టేషన్ ఎదుట ఒక వర్గానికి మద్దతుగా బోడే రామచంద్ర యాదవ్‌తో పాటు మరికొందరు రాస్తారోకో చేయడంతో పోలీసులు కేసులు నమోదు చేశారు.

రేపటి నుంచి దివ్యాంగుల ఉపకరణాల గుర్తింపు శిబిరాలు

ఒంగోలు వన్‌టౌన్: దివ్యాంగులకు అవసరమైన పరికరాల గుర్తింపు శిబిరాలను ఈ నెల 27 నుంచి 31వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు జి.అర్చన శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 27న కొండపి జిల్లా ప్రజాపరిషత్ హైస్కూల్, 28న సింగరాయకొండ జిల్లా ప్రజాపరిషత్ హైస్కూల్, 29న గిద్దలూరు ఏరియా హాస్పిటల్, 30న కనిగిరి అమరావతి గ్రౌండ్స్, 31వ తేదీన దర్శి ఆర్అండ్‌బీ బంగ్లా వద్ద శిబిరాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. శిబిరాలను భారత ప్రభుత్వ సంస్థ ఆలింకో, జిల్లా విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల శాఖ సంయుక్తంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శిబిరంలో పాల్గొనే వారు ఆధార్ కార్డు, సదరం ధ్రువీకరణ పత్రం, యూడీఐడీ కార్డు, రేషన్ కార్డు, రెండు పాస్‌పోర్టు సైజు ఫోటోలు తీసుకురావాలని కోరారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకూ శిబిరాలు ఉంటాయని తెలిపారు. ఇతర పూర్తి వివరాలకు 08592-281310 నంబర్‌ను సంప్రదించాలని అర్చన సూచించారు.